క్లుప్తంగా

మోదీ దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టౌన్ : తెలంగాణ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మంగళవారం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీ కళాశాల వద్ద ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జునముదిరాజ్, నోముల క్రాంతియాదవ్, పొడిశెట్టి అరవింద్, చింతల ఉదయ్, వెలుగు పాండు, ఉప్పల చంద్రశేఖర్, నాగరాజు, సాయికుమార్, యాదయ్య, శంకర్, లింగస్వామి, శ్రీహరి పాల్గొన్నారు.

విధుల్లో చేరిన గెజిటెడ్ హెచ్ఎంలు

చిట్యాల : మండలంలోని పలు జెడ్పీహెచ్ఎస్‌లలో ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా వచ్చిన గెజిటెడ్ హెచ్ఎంలు మంగళవారం విధుల్లో చేరారు. చిట్యాల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా కరుణాకర్‌రెడ్డి, గుండ్రాంపల్లి హెచ్ఎంగా కొండకింది అంజిరెడ్డి, చిన్నకాపర్తి హెచ్ఎంగా సైదానాయక్, వట్టిమర్తి హెచ్ఎంగా రమేష్, పెద్దకాపర్తి హెచ్ఎంగా పద్మజ, వనిపాకల హెచ్ఎంగా శ్రీనయ్యాచారి, నేరడ హెచ్ఎంగా రాంమోహన్ విధుల్లో చేరారు.

ఆర్థికసాయం అందజేత

మునుగోడు : మండల కేంద్రానికి చెందిన చిలుకరాజు యాదయ్య గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి పంపిన రూ. 10వేల ఆర్థికసాయాన్ని ఎంపీపీ కర్నాటి స్వామి మంగళవారం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రావిరాల కుమారస్వామి, ఐతగోని విజయ్, రాము ఉన్నారు.

ఆలయ పరిసరాల పరిశీలన

కనగల్ : దర్వేశిపురం ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని ఆలయ చైర్మన్ అల్లుబెల్లి నర్సింహారెడ్డి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆలయ పరిసరాలను ఈఓ జల్లేపల్లి జయరామయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆలయం వద్ద పారిశుద్ధ్యం, నీరు, లైటింగ్ తదితర వాటిపై సమీక్ష నిర్వహించి అభివృద్ధి చేస్తామన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత

నల్లగొండ టౌన్ : హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లగొండ పట్టణంలోని అబ్బాసియా కాలనీకి చెందిన మహ్మద్ యూసూఫ్‌అలీకి మంజూరైన రూ.2లక్షల 50 వేల ఎల్ఓసీని ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి పాల్గొన్నారు.

ఆదర్శ విద్యార్థుల ప్రతిభ

మర్రిగూడ : దేవరకొండ డివిజన్ స్థాయిలో ఆదివారం నిర్వహించిన ఖోఖో పోటీల్లో మర్రిగూడ మండల ఆదర్శ పాఠశాల విద్యార్థులు అండర్‌-14 బాలికల విభాగంలో ప్రథమ స్థానం, అండర్‌-17 విభాగంలో ద్వితీయ స్థానం, అండర్‌-17 బాలుర విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన క్రీడాకారులతోపాటు పీడీ రాంనరేష్‌ను ఆదర్శ పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

మాజీ ఉప సర్పంచ్ మృతి

శాలిగౌరారం : మండలంలోని తక్కెళ్ళపహాడ్ మాజీ ఉప సర్పంచ్ తీర్పారి నారాయణ(72) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. సీపీఎం నాయకుడిగా ఉన్న నారాయణ 1988 నుంచి 93 వరకు ఉప సర్పంచ్‌గా పనిచేశారు. నారాయణ మృతదేహాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మందుల సామేల్ సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోదల నరేందర్‌రెడ్డి, తీర్పారి మల్లయ్య, వజ్జె భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల పట్టివేత

నాంపల్లి : అనుమతులు లేకుండా తరలిస్తున్న గ్యాస్ సిలిండర్లను మంగళవారం అధికారులు పట్టుకున్నారు. నాంపల్లిలోని విజయలక్ష్మి హెచ్‌పీ గ్యాస్ డీలర్ గోదాం నుంచి ధ్రువపత్రాలు లేకుండా వాహనంలో 31గ్యాస్ సిలిండర్లను తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పట్టుకుని సివిల్ సప్లయీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అనంతరం వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. విచారణ అనంతరం తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దేవ్‌సింగ్ తెలిపారు.

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

చిట్యాల : విధి నిర్వహణలో మృతి చెందిన, దివ్యాంగులైన కల్లు గీత కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని గీత పనివారల సంఘం రాష్ట్ర నాయకుడు పబ్బు వీరాస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులుగౌడ్ డిమాండ్ చేశారు. చిట్యాలలో మంగళవారం జరిగిన సంఘం మండల సమావేశంలో వారు మాట్లాడారు. చిట్యాల మండలాన్ని చండూరు ఎక్సైజ్ పరిధి నుంచి నల్లగొండ ఎక్సైజ్ పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు.

వర్క్‌బుక్‌ల పంపిణీ

కేతేపల్లి : కొర్లపహాడ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం 'జ్ఞానంతో ఆనందం'అనే వర్క్‌బుక్‌లను పంపిణీ చేశారు. హెచ్ఎం కోట వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టోల్ మేనేజర్ శివ, ఎస్‌హెచ్ఏఐ ప్రతినిధి సతీష్, ఫౌండేషన్ ప్రతినిధులు నరేష్, సందీప్ పాల్గొన్నారు.

కాల్వలు పారలే.. చెరువులు నిండలే

- మునుగోడు మండలంలో లోటు వర్షపాతం
- నీరు లేక వెలవెలబోతున్న చెరువులు
- భూగర్భ జలాలు అడుగంటడంతో ఆందోళనలో రైతులు


అడుగంటిన జక్కలివారిగూడెం నడిమికుంట

మునుగోడు: ప్రస్తుత వానాకాలంలో మునుగోడు మండలంలో లోటు వర్షపాతం నమోదు కావడంతో కాల్వలు, వాగుల్లో నీరు పారలేదు. ఫలితంగా చెరువులు చుక్కనీరు లేక వెలవెలబోతున్నాయి. ఈ ఏడాది జూన్ మాసంలో ఒకటి, రెండు రోజులు మాత్రమే వర్షం కురిసింది. జూలైలో ముసురు మాత్రమే పడడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. సీజన్‌లో ఇప్పటి వరకు 480 మిల్లీమీటర్ల వర్షపాతం కురవాల్సి ఉండగా 330 మి.మీ మాత్రమే కురిసిందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. లోటు వర్షపాతం కారణంగా పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

5 సెంటీ మీటర్లకు మించి కురవని వర్షం..

ఈ ఏడాది మునుగోడు మండలంలో 5 సెంటీమీటర్లకు మించి వర్షం కురవలేదు. జూలై 18వ తేదీ నుంచి దాదాపు 10రోజుల పాటు వర్షం కురువగా మొదటి రోజు కేవలం 2.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగిలిన రోజుల్లో 2 సెంటీమీటర్ల లోపు నమోదైంది. గత నెల 27న మాత్రమే కాస్త అధికంగా కురవడంతో 4.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గతంలో ఈ సమయానికి ఒకటి, రెండుసార్లు కనీసం 11 నుంచి 14 సెంటీమీటర్ల వర్షం కురిసేది. అలా కురిస్తే మండలంలోని మునుగోడు పెద్ద వాగు పారడంతోపాటు పలు చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరేది. కానీ ఈ ఏడాది సెప్టెంబర్ మాసం సగానికి వచ్చినా కేవలం 4 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. దీంతో ఎక్కడా వరదలు పారక కాల్వల్లోకి నీరు చేరలేదు.

మండల వ్యాప్తంగా 112 చెరువులు..

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో 112 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 10 చెరువులు పెద్దవి కాగా 102 చెరువులు చిన్నవి. అయితే గత ఏడాది నిండిన దాదాపు సగానికిపైగా చెరువుల్లో ఇప్పటికి 30 శాతం నుంచి 40 శాతం వరకు నీరు నిల్వ ఉంది. ప్రధానంగా పెద్ద చెరువులైన మునుగోడు, సోలిపురం, కిష్టాపురం, తదితర చెరువుల్లోనే 20 శాతం నుంచి 30శాతం నీరు నిల్వ ఉంది. మిగిలిన చీకటిమామిడి, పులిపలుపుల, కొంపల్లి, కొరటికల్, కల్వలపల్లి తదితర గ్రామాల్లోని పెద్ద చెరువుల్లో కేవలం 10 శాతం లోపు నీరు ఉంది. నేటికి చెరువులు, కుంటల్లో నీరు రాకపోవడంతో మండలంలోని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

చెరువుల్లో నీటి నిల్వలు లేవు

మండలంలోని ఏ ఒక్క చెరువులోకి ఈ ఏడాది పెద్ద మొత్తంలో నీరు రాలేదు. గతంలో వచ్చి చేరిన నీరు మాత్రమే పలు గ్రామాల పెద్ద చెరువుల్లో 20 నుంచి 30 శాతం వరకు నీరు నిల్వ ఉంది. భారీ వర్షాలు కురవని కారణంగా ఎక్కడా కాల్వలు, వాగు పారలేదు. దీంతో అనేక చెరువుల్లో నీరు లేకుండా పోయింది.

– ప్రేమ్‌కుమార్, ఐబీ, డీఈ

ప్రతి ఏడాది జూన్ మాసంలోనే..



మా గ్రామంలోని నడిమికుంట ప్రతి ఏటా జూన్ మాసంలోనే నిండేది. ఈ ఏడాది ఇప్పటి వరకు కనీసం సగం కూడా నిండలేదు. ఒక్క భారీ వర్షం కురిసినా పెద్ద వాగు పారి పలివెల ఫీడర్ చానల్ ద్వారా మా చెరువులోకి నీరు వచ్చి చేరేది. కానీ ఈ ఏడాది వాగు పారలేదు.

– జక్కలి శ్రీను, సర్పంచ్, జక్కలివారిగూడెం

క్రిస్టియన్ల ఆర్థిక అభివృద్ధికి సీఎం కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు : క్రిస్టియన్లు ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలంలోని సింగారం గ్రామ హౌజ్ ఆఫ్ ప్రేయర్ చర్చిలో మంగళవారం నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ దైవ సేవకుల ఆత్మీయ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో పేద కుటుంబాలకు చెందిన క్రిస్టియన్లకు తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డి.రాజేశ్వర్‌రావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు జాన్‌శాస్త్రీ, బిషప్ నీల్సన్, కాలేపు శ్రీనివాస్, ఎంపీపీ కర్నాటి స్వామి, సర్పంచ్ గుర్రాల పరమేష, బీఆర్ఎస్ నాయకులు లపంగి నర్సింహ, పోలగోని సైదులు, ఆర్.ప్రభాకర్, సాగర్, అబ్రహం, ఎజ్రా, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం రోడ్డెక్కిన యడవల్లి గ్రామస్తులు


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామస్తులు నీటి కోసం రోడ్డెక్కారు. పండగ పూట తమ ఇళ్లలోకి తాగునీరు సరఫరా కావడం లేదని సోమవారం జి యడవల్లి–చండూరు ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ జాం కావడంతో ఎస్ఐ అంతిరెడ్డి, పోలీసులు అక్కడకు చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు మహిళలకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీసులు గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించుకున్నారు. విషయం తెలుసుకున్న భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి యడవల్లిలో నీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన కలెక్టర్ సాయంత్రం వరకు సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో నీరు సరఫరా అయ్యేవిధంగా చూశారు.

ఎంపీ కోమటిరెడ్డి ఆర్థికసాయం

నల్లగొండ : నల్లగొండ నియోజకవర్గంలో మంగళవారం మృతి చెందిన పలు కుటుంబాలకు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. నల్లగొండ పట్టణంలోని 1వ వార్డు పానగల్‌లో వాకింగ్ చేస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓర్సు విష్ణు–స్వప్న దంపతులు మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ద్వారా అందజేశారు. విష్ణు–స్వప్న దంపతుల పిల్లల పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అదేవిధంగా 27వ వార్డు అశోక్ నగర్ కాలనీకి చెందిన బొమ్మల కౌశల్య, 28వ వార్డుకు చెందిన కొండ కృష్ణయ్య మృతి చెందగా బాధిత కుటుంబాలకు రూ.20 వేల చొప్పున గుమ్ముల మోహన్‌రెడ్డి ద్వారా ఎంపీ అందజేశారు. జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య, కౌన్సిలర్ బుర్రి రజిత యాదయ్య, ఆలకుంట నాగరాజు, మాజీ కౌన్సిలర్ సట్టు శంకర్ పాల్గొన్నారు.

కనగల్ : మండల పరిధిలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన పగిడిమర్రి లింగయ్య మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుటుంబానికి భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పంపిన రూ.20 వేల నగదును స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అరూప్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గోలి నర్సిరెడ్డి, మాజీ సర్పంచ్ గోలి జగాల్‌రెడ్డిలు లింగయ్య, మాజీ ఎంపీటీసీ సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం

నల్లగొండ టౌన్ : చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కెబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేస్తూ నల్లగొండలో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కన్మంతరెడ్డి శ్రీదేవి, గార్లపాటి జితేంద్రకుమార్, వర్షిత్‌రెడ్డి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు నీరజ, ప్రధాన కార్యదర్శి రావిళ్ల కాశమ్మ, హైమావతి, అరుణ, ధనలక్ష్మి, వెంకన్న, యాదగిరిచారి, రాజశేఖర్‌రెడ్డి, భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీకి..

కేంద్ర కేబినెట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం స్థానిక గడియారం సెంటర్‌లో ఎమ్మెల్సీ కవిత ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా మహిళా కన్వీనర్ ఆడెపు వరలక్ష్మి మాట్లాడుతూ కవితక్క పోరాటానికి తలవంచి కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును పెట్టి ప్రవేశపెట్టిందన్నారు. ఇందిరా, వీర శైలజ, మమత, దేవకమ్మ, మంగ, అనిత, సరిత పాల్గొన్నారు.

సమ్మెను విచ్ఛిన్నం చేయాలనుకోవడం తగదు

చండూరు : అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెను ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలనుకోవడం తగదని ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు దోటి వెంకన్న అన్నారు. చండూరు తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెలో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. బీఎస్పీ నాయకులు బొట్ట శివ, నేరెళ్ల ప్రభుదాస్, మేడి శాంతికుమార్, నజీరుద్దీన్ అంగన్‌వాడీ సిబ్బంది సునీత, జగదీశ్వరి, కేదారి, పార్వతమ్మ, తారక, నాగమణి, శోభ, రజని, పుష్ప వేణి, శారద, ప్రమీల, ఉష, సత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంఠమహేశ్వర స్వామి బోనాల వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న పల్లె రవికుమార్

చండూరు : గట్టుప్పల మండలం తేరట్‌పల్లి గ్రామంలో సోమవారం శ్రీ కంఠమహేశ్వర స్వామి బోనాల వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు . ఈ సందర్భంగా కంఠమహేశ్వర స్వామికి, వన మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచ్ వీరమల్ల శ్రీశైలం గౌడ్, గౌడ సంఘం నాయకులు గిరి సత్తయ్యగౌడ్, మాదగోని జంగయ్యగౌడ్, వీరమల్ల మల్లేశ్‌గౌడ్, రాములుగౌడ్, జేఎం గౌడ్, జనగామ కోటిగౌడ్, వీరమల్ల సాయితేజ పాల్గొన్నారు.

రోడ్డు కబ్జాను అడ్డుకోవాలని ధర్నా


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందిస్తున్న గ్రామస్తులు

మునుగోడు : మండలంలోని సింగారం గ్రామంలో ప్రభుత్వ భూమిలోకి వెళ్లే ప్రధాన రహదారిని కబ్జా చేసి కడుతున్న నిర్మాణాలను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ఆ గ్రామ ప్రజలు మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఏళ్లుగా గ్రామ ప్రజలు నడుస్తున్న రహదారిని అధికార పార్టీకి చెందిన వారు కబ్జాచేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, గ్రామ పంచాయతీ అధికారులు అడ్డుకోకుండా కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అదే సమయంలో ఆ గ్రామంలో ఓ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి గ్రామస్తులు వినతి పత్రం అందించారు. అనంతరం గ్రామంలోని పలు కాలనీలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఆ గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించేందుకు రూ. 20 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

రెవెన్యూ డివిజన్‌పై కొనసాగుతున్న ఆందోళనలు


నాంపల్లి : దీక్షలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

మునుగోడు : నియోజకవర్గ కేంద్రమైన మునుగోడును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ భారతీయ ప్రజాపార్టీ జాతీయ అధ్యక్షుడు మాదగోని వెంకటేశ్వర్లుగౌడ్ మునుగోడులోని అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం కొనసాగింది.

నాంపల్లి : పాత తాలుకా కేంద్రమైన నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ నాంపల్లిలోని అంబేద్కర్ చౌరస్తాలో అఖిలపక్ష నాయకులు చేస్తున్న రిలే దీక్షలు మంగళవారం కొనసాగాయి. సీపీఎం మండల కార్యదర్శి నాంపల్లి చంద్రమౌళి, టీడీపీ మండల అధ్యక్షురాలు మొగుదాల పార్వతమ్మ, గాలెంక గురుపాదం, కాంగ్రెస్ నాయకులు గాదెపాక వేలాద్రి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మంగి మహేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు పల్లేటి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు


నల్లగొండ పట్టణంలోని సావర్కర్‌నగర్‌లో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కంచర్ల


బీట్ మార్కెట్ రామకోటి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ పట్టణంలోని శివాజీ నగర్ సెంటర్‌లో..


నల్లగొండ పట్టణంలోని బోయవాడలో పూజలో పాల్గొన్న భక్తులు

రామగిరి(నల్లగొండ): గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నల్లగొండ పట్టణంలోని 40వ వార్డు సార్కర్‌నగర్‌లో నీలగిరి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, జనార్దన్‌రావు, నాంపల్లి శ్రీనివాస్, కాకునూరి వీరాచారి, మామిడి పద్మ, సువర్ణ, గుంటోజు బ్రహ్మాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు నాంపల్లి ప్రణయ్, మునాస సాయి, మేకల రవి పాల్గొన్నారు.

కనగల్ : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండపాల వద్ద భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

చిట్యాల : మండల వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉరుమడ్ల గ్రామంలోని ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, ఎస్ఐ రవి, మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, ఏపూరు సర్పంచ్ పాలెం మాధవి, మాజీ వైస్ ఎంపీపీ పాలెం మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు గడకారి సైదులు, గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : వినాయక చవితి సందర్భంగా మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో సోమవారం గణనాథులు కొలువుదీరారు. మండల వ్యాప్తంగా 350 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వినాయక విగ్రహాలను అందంగా అలంకరించిన మండపాలలో ప్రతిష్ఠించారు.

శాలిగౌరారం : వినాయక చవితి వేడుకలు శాలిగౌరారం మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. మండల వ్యాప్తంగా 140 వినాయక విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేశారు.

మునుగోడు : గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో భక్తులు వినాయక విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో గ్రామానికి ఐదు నుంచి పది చొప్పున దాదాపు 210 కిపైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు.


కేతేపల్లి : ఇనుపాములలో..


చిట్యాల : పూజలో పాల్గొన్న ఎస్ఐ రవి

మర్రిగూడ : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను సోమవారం ప్రజలు ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల దాతలు వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

నాంపల్లి : మండల వ్యాప్తంగా గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలోని గాంధీనగర్‌లో ..


జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ..


పానగల్ రోడ్డు శ్రీనగర్ కాలనీలో పూజలో పాల్గొన్న పిల్లి రామరాజు

రైతుల ఆర్థిక అభివృద్ధే పీఏసీఎస్ లక్ష్యం


రుణమాఫీ చెక్కులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

మునుగోడు : రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే పీఏసీఎస్ ప్రధాన లక్ష్యమని డీసీసీబీ డైరెక్టర్, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సంఘంలో రుణాలు తీసుకున్న రైతులకు మంగళవారం రుణమాఫీ చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. తమ సంఘం ద్వారా రైతులకు సబ్సిడీ ఎరువులు, విత్తనాలతోపాటు వివిధ రకాల రుణాలు అందిస్తున్నామన్నారు. రైతుల కుమారులు, కుమార్తెలు ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లేందుకు రుణాలు సైతం అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ సుఖేందర్, తాటికొండ సైదులు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేదలకు న్యాయం

నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు గోపగాని మాధవి అన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని 37వ వార్డు రవీంద్రనగర్‌లో కాంగ్రెస్ గ్యారంటీ పథకాలతో ఇంటింటి ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయభేరి సభలో ఇచ్చిన గ్యారంటీ పథకాల హామీతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు రూ. 500 కే గ్యాస్ సిలిండర్, ప్రతి మహిళకు నెలకు రూ.2,500, ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం తదితర పథకాలు అమలు చేస్తామన్నారు. మోసపూరిత హామీలతో పాలన సాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ఎండగడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత, సూరెడ్డి సరస్వతి, పట్టణ అధ్యక్షురాలు నాంపల్లి భాగ్య, జిల్లా కార్యదర్శి షేక్ జాను, వనం లలిత, ఎస్.అక్షిత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

రామగిరి(నల్లగొండ): బాలికల సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం అవసరమని సీడీపీఓ టి.నిర్మల అన్నారు. బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మంగళవారం తిప్పర్తి బాలికల ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోషక అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ రకాల పోషక పదార్థాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.సునీత, ఉపేంద్ర, మండల వైద్యాధికారి ప్రదీప్‌బాబు, ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు జానమ్మ, లక్ష్మి, మమత, శ్రీదేవి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

చండూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణులకు ఐసీడీఎస్ సీడీపీఓ కవిత మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్లు సుజాత, శివేషా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గట్టుప్పల్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సూపర్‌వైజర్ శివేషా పౌష్టికాహారం అందజేశారు.

ఆశా కార్యకర్తలకు అంగన్‌వాడీ బాధ్యతలు అప్పగింత

మర్రిగూడ : అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉండడంతో కలెక్టర్ ఆదేశానుసారం మంగళవారం మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో ఆశా కార్యకర్తలు అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యతలు చేపట్టారు. అనంతరం లబ్ధిదారులకు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో చింతపల్లి సీడీపీఓ లావణ్యకుమారి, సూపర్‌వైజర్లు మిర్యాల పద్మ, ముమ్మడి యశోద, ఎంపీఓ యూసుఫ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కనగల్ : పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని శాబ్దుల్లాపురం సర్పంచ్ దాసిరెడ్డి జ్యోతిరవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్లు, ట్యాంకుల వద్ద శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, కృష్ణారెడ్డి, వెంకన్న, భిక్షమయ్య, వెంకటేశ్, అరుణ్, అనిల్, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, సత్తయ్య, వంశీ, నవీన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.